క్లుప్తంగా

తీరానికి గుర్తు తెలియని మహిళ మృతదేహం



తీరానికి కొట్టుకువచ్చిన మహిళ మృతదేహం

బీచ్ రోడ్డు: ఆర్కే బీచ్ తీరానికి గుర్తు తెలియని మహిళ మృతదేహం సోమవారం కొట్టుకువచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటలకు కాళీమాత ఆలయం ఎదురుగా తీరంలో ఒక మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఆమె వయస్సు సుమారు 65 ఏళ్ల ఉంటుందని, ఎత్తు 5 అడుగులు, ముదురు ఎరుపు రంగు చీర, నలుపు రంగు జాకట్టు ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచామన్నారు. మహిళను గుర్తించిన వారు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

అక్కిరెడ్డిపాలెం: మకర సంక్రాంతిని పురస్కరించుకొని షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామికి విశేష పూజలు చేశారు. ఆదివారం పడిపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి అయ్యప్ప విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, శేషగిరిరావు, శ్రీ మణికంఠ జ్యోతి సేవా సంఘం ప్రతినిధులు, అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



లలితాపీఠంలో హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితాపీఠంలో బహుళ అష్టమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. పీఠం అర్చకులు, పండితుల వేదమంత్రాల నడుమ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా దీక్ష తీసుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో లలితా దీక్షలు సంక్రాంతి రోజు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నుంచి మాఘ పౌర్ణమి వరకు దీక్షధారులు 21 రోజుల పాటు దీక్షలో ఉంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యులు ఆదిత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు వసతి కరువు

- ఇరుకు భవనంలో నెట్టుకొస్తున్న పోలీసులు
- మధ్యలో నిలిచిన కొత్త భవనం పనులు



ఆరిలోవ పోలీస్ స్టేషన్



విమ్స్‌లో ఆవరణలో అసంపూర్తిగా కొత్త భవన నిర్మాణం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఇరుకు భవనంలో కొనసాగుతోంది. వేల నివాసాలు, లక్షలాది మంది ప్రజలు, నిత్యం గొడవలు, ఘర్షణలతో రద్దీగా ఉండే ఈ స్టేషన్‌కు దశాబ్దాలుగా మోక్షం కలగడం లేదు. పోలీస్ సేవలు ఇక్కడ ఇరుకు గదుల్లోనే సాగుతున్నాయి. ఇక్కడ పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ లేకపోవడంతో సిబ్బందితో పాటు ఫిర్యాదుదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. స్టేషన్ పరిధి విశాలం కావడంతో అధిక సంఖ్యలో సిబ్బంది ఉన్నారు. ఇక్కడ సిబ్బందికి, ఫిర్యాదు చేయడానికి వచ్చినవారికి ఈ గదులు చాలడం లేదు. కొత్త భవనం కోసం చేపట్టిన నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. కొత్తగా స్టేషన్ నిర్మాణం కోసం విమ్స్ ఆవరణలో ఎకరం స్థలం కేటాయించారు. దానిలో భవన నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ పనులు నిలిచిపోయాయి.

పరిధి విశాలం.. సౌకర్యాలు శూన్యం

ప్రస్తుతం ఇక్కడ ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ), నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్ల(ఎస్‌ఐలు)తో పాటు ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో కలిపి సుమారు 45 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. వారికే ఇక్కడ ఉండడానికి సరిపడా షెల్టర్లు లేవు. చిన్న గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. సుమారు ఏడేళ్లల క్రితం దీని పరిధి పెరిగింది. ప్రస్తుతం దీని పరిధిలో అటు రుషికొండ, గీతం వర్సిటీ, ఎండాడ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాలు, ఇటు హనుమంతవాక, డెయిరీఫారం, రవీంద్రగనర్, ఆరిలోవ, విశాఖ కేంద్ర కారాగారం, పైనాపిల్‌కాలనీ, దారపాలెం వరకు విస్తరించింది. ఇదిగాక జాతీయ రహదారిపై ఎండాడ కూడలి నుంచి జూ పార్కు విశాఖ వేలీ స్కూల్ కూడలి మీదుగా డెయిరీఫారం, హనుమంతవాక వరకు, మరోపక్క బీచ్‌రోడ్డులో తెన్నేటి పార్కు నుంచి జోడుగుళ్లపాలెం, జూ సాగర్ గేట్, సాగర్‌నగర్ మీదుగా గీతం వర్సిటీ దాటి చినరుషికొండ కూడలి వరకు దీని పరిధి విస్తరించారు. ఇంత విశాలమైన పరిధిలో పనిచేయడానికి అవసరమైన సిబ్బంది ఉన్నారు. కానీ స్టేషన్ మాత్రం చిన్నగదిలోనే నిర్వహిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ఓ గదిని లోపల చిన్న భాగాలుగా చేసి, అందులో సీఐ కేబిన్, పక్కనే ఎస్‌ఐలు కూర్చోవడానికి టేబుళ్లు, కంప్యూటర్ ఆపరేటర్, రైటర్, రికార్డులు రాసేవారికి కేటాయించారు. మరికొంతమంది ఇటీవల బయట రేకుల షెడ్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఎస్‌ఐతోను, సీఐతోను ఏదైనా సమస్య విన్నవించుకోవాలనుకొనే ప్రజలకు ఇబ్బంది ఎదురవుతోంది. అందరూ ఒకేసారి ఇరుకు గదిలోకి వెళ్లడంతో గందరగోళం నెలకొంటుంది. నగర పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

తీరంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీస్ డాగ్

బీచ్ రోడ్డు: తీరంలో నిఘా పెంచే కార్యక్రమంలో భాగంగా పోలీసులు డాగ్ స్క్వాడ్ తనిఖీలు విస్తృతం చేశారు. సోమవారం ఆర్కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం తీరం వరకు పోలీస్ నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సీజర్, లక్కీలు అనే రెండు డాగ్స్ తీరంలోని అనుమానిత వస్తువులను పరిశీలించాయి. పోలీసులు కూడా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించారు.

తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు



తండ్రికి బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

బీచ్ రోడ్డు: సాగర తీరంలో తప్పిపోయిన బాలుడిని తండ్రి చెంతకు పోలీసులు చేర్చారు. తక్కువ సమయంలో బాలుడి ఆచూకీని గుర్తించిన పోలీసులను నగర సీపీ శ్రీకాంత్ అభినందించారు.

వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన మనస్వీ బెహరా(5) తన కుటుంబంతో కలిసి ఆర్కే బీచ్‌కు వచ్చాడు. తీరంలో సరదాగా గడుపుతున్న సమయంలో ఆకస్మాత్తుగా మనస్వీ కనిపించలేదు. దీంతో సాయంత్రం 5 గంటలకు బీచ్ అవుట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన పోలీసులు తమ బీబీ వాట్సాప్ గ్రూప్‌లో బాలుడు ఫొటో షేర్ చేశారు. పోలీసులు తీరం మొత్తం గాలించగా.. పోలీసు మెస్ ఎదురుగా 5:23 గంటలకు బాలుడిని గుర్తించి, తండ్రికి అప్పగించారు. ఈ సందర్భంగా బాలుడు తండ్రి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత ఉక్కు కార్మికులదే..



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఒక పరిశ్రమ పరిరక్షణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత విశాఖ ఉక్కు కార్మికులకే దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతకుముందు దేశంలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే దీక్షల్లో 704వ రోజు, సోమవారం దీక్షలో కార్మికులతో పాటు 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, ముస్లిం సోదరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, కె.ఎస్.ఎన్.రామారావు, ఎస్.రామచంద్రరావు, జె.రామకృష్ణ, వై.మస్తానప్ప తదితరులు ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు పోరాటం కొనసాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని, కార్మికులంతా ఏకమై ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్లాంట్‌లో విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. ఈ నెల 30న జరపతలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పతంగుల పండగ



ఉక్కు త్రిష్ణ మైదానంలో పతంగుల పండగను ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో పతంగుల పండగ ఉత్సాహంగా జరిగింది. సంక్రాంతి సందర్భంగా స్థానిక త్రిష్ణ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ ఉక్కునగరం యూనిట్ అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పతంగుల పండుగ భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలను, పెద్దలను టీవీలకు బందీలు కాకుండా చేసిన యూత్ హాస్టల్స్ ఉక్కునగరం శాఖ ప్రతినిధులు అభినందనీయులన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పతంగులను ఎగరవేయడం, వాటిపై పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన సీనియర్, జూనియర్ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, ఇ. శ్రీనివాసరావు, సీహెచ్. వేణు, నాగసాయి, సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా బండి చిత్ర ప్రదర్శన రేపు

సీతంపేట: నగరానికి చెందిన వర్ధమాన దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొంది, జాతీయ అవార్డు పొందిన 'సినిమా బండి' తెలుగు చిత్రాన్ని 18వ తేదీ ఉదయం 9:45 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సినిమా ప్రదర్శన అనంతరం దర్శకుడు ప్రవీణ్‌తో ముఖాముఖి, సత్కార కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ఔత్సాహికులు పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ట్రాఫిక్ వలంటీర్లకు ఆహ్వానం

మద్రిపాలెం: ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పని చేసేందుకు వలంటీర్లు కావాలని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆసక్తి గల యువకులు, వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘసేవకులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలియజేశారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, ట్రాఫిక్ పోలీసులకు సహకరించేందుకు, ట్రాఫిక్ రూల్స్ ప్రచారం చేసేందుకు, కౌన్సెలింగ్ చేసేందుకు ఆసక్తిగలవారు సంప్రదించాలని సూచించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కంచరపాలెం, ధర్మానగర్, దుర్గానగర్, జ్ఞానాపురం, ఊర్వశి, కప్పరాడ, మాధవధార, మురళీనగర్, ఐటీఐ జంక్షన్, మద్రిపాలెం, 104 ఏరియా, కరాస, బర్మానగర్, ఎన్ఏడీ, బుచ్చిరాజుపాలెం, విమాన్‌నగర్, కాకానినగర్, ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఉత్సాహవంతులైన వారు ముందుకు రావచ్చన్నారు. ట్రాఫిక్ పోలీసుతో కలిసి వలంటీర్‌గా పని చేయాలనుకునే వారు నేరుగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో లేదా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావును 9440796037 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సైక్లిస్ట్ దుర్మరణం



మృతుడు వెంకట రమణ (ఫైల్ ఫొటో)



ప్రమాదంలో దుర్మరణం చెందిన వెంకట రమణ

అక్కిరెడ్డిపాలెం: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనకు సంబంధించి గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక బీసీ రోడ్డు భానోజీ కాలనీ, సీతారాంనగర్‌కు చెందిన గంట వెంకట రమణ (58) ఆటోనగర్‌లోని ఒక కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులు ముగించుకుని, ఇంటికి వెళ్లే క్రమంలో సైకిల్‌పై ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద వెంకట రమణను ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట రమణ తలకు తీవ్ర గాయమై, అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి



కల్యాణం చేస్తున్న వెంకన్న ఆలయ అర్చకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి లక్ష్మీపురం కాలనీలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంక్రాంతి సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

వెంకటాద్రిపై..

పెదగంట్యాడ: దయాల్‌నగర్ వెంకటాద్రిపై వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ ధర్మకర్తలు తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణం జరిపించారు.

ఉక్కు వెంకన్న ఆలయంలో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. స్వామిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయ్ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉక్కునగరానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై, కల్యాణం తిలకించారు.

కనులపండువగా మకరవేట

- వరదరాజస్వామిగా సింహాద్రి అప్పన్న
- విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం



పంటలు బాగా పండుతాయో లేదా తెలుసుకునేందుకు బాణాసంచా వదులుతున్న దృశ్యం



కొండపై నుంచి పూలతోటలోకి స్వామిని తిరువీధిగా తీసుకొస్తున్న దృశ్యం



గజవాహనంపై స్వామికి అడవివరంలో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. రెండు చేతులు జోడించి స్వామికి జేజేలు పలికారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరణ చేసి సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించారు. రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేశారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, పవన్‌కుమారాచార్యులు, చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్‌రాజ్, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈఈ త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని కొలను వద్ద మూడుసార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి తిరిగి రావడంతో ఈఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని విశ్వసించారు.

కోటనరవలో విద్యార్థిని బలవన్మరణం



మృతిచెందిన స్వాతి

సింహాచలం: విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పెందుర్తి మండలం కోటనరవలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లి భూలక్ష్మి తెలిపిన వివరాలు ప్రకారం... కోటనరవలో తల్లి భూలక్ష్మి, అమ్మమ్మతో కలిసి సిరలపు స్వాతి(17) ఉంటోంది. నరవలో స్వాతి చదువుతోంది. మరో వైపు యూట్యూబ్‌లో పలు ప్రోగ్రామ్స్ చేస్తుంటుంది. ఆదివారం రాత్రి ఇంట్లో భూలక్ష్మి బెడ్‌రూమ్‌లో పడుకుని ఉండగా హాల్‌లో స్వాతి యూట్యూబ్ చాటింగ్ చేసుకుంటోంది. సోమవారం తెల్లవారుజాము సమయంలో తల్లి నిద్రించిన గదికి బయట గడియపెట్టి హాల్‌లో ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో భూలక్ష్మి నిద్రలేచి బెడ్‌రూమ్‌లో నుంచి బయటకి వచ్చేందుకు తలుపు తీసేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో కిటికీలో నుంచి కేకలు వేసింది. వెంటనే ఇరుగుపొరుగు వారు వచ్చి ఇంటి ప్రధాన ద్వారం గ్రిల్స్ తాళం విరగ్గొట్టారు. లోపలికి ప్రవేశించి బెడ్‌రూమ్ గది గడియ తీశారు. వెంటనే పెందుర్తి పోలీసులకు భూలక్ష్మి ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు పరిశీలన జరిపి మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా కోటనరవలోనే ఉంటున్న నవీన్ అనే యువకుడుతో స్వాతికి పరిచయం ఉందని, దాంతో తాను స్వాతిని మందలించగా అతనితో మాట్లాడటం మానేసిందని, కానీ పదేపదే స్వాతిని నవీన్ వేధిస్తుండటంతోనే ఆమె మృతిచెందిందని మృతురాలు తల్లి భూలక్ష్మి ఆరోపిస్తున్నారు.

రైతుబజారు ఖాళీ

సీతమ్మధార: సంక్రాంతి పండగ ప్రభావం రైతుబజార్లపై పడింది. నగరవాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో నగరం చాలావరకు ఖాళీ అయింది. దీంతో కొనుగోలుదారులు లేక సీతమ్మధార రైతుబజారు వెలవెలబోయింది. రైతులు విక్రయాల కోసం తెచ్చిన కూరగాయలు, ఆకుకూరలు మొదలైనవి మిగిలిపోవడంతో, వాటిని వెనుకకు తీసుకువెళ్లాల్సి వచ్చింది.

వివాహిత ఆత్మహత్య



ఉదయదేవి (ఫైల్)



ఘటనా స్థలంలో పోలీసులు

మద్రిపాలెం: పండగ పూట ఓ ఇంట్లో విషాదం నెలకొంది. భర్తతో స్వల్ప వివాదం కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఊర్వశి జంక్షన్ దరి ఇందిరానగర్-2 ప్రాంతంలో చదువుల రవికుమార్, ఉదయదేవి (35) దంపతులు నివసిస్తున్నారు. రవికుమార్ ఏసీ మెకానిక్ కాగా, ఉదయదేవి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగకు రావాలని ఉదయదేవిని పుట్టింటి వారితో పాటు ఆమె పెద్దమ్మ కూడా ఆహ్వానించారు. ఎవరింటికి ముందు వెళ్లాలనే విషయంలో భార్యాభర్తలిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రవికుమార్ ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. కేజీహెచ్‌కు తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోయింది. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్ కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.